క్లుప్తంగా

ఆదివారం అమావాస్య ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలోని పలు శివాలయాల్లో ఆదివారం అమావాస్య పురస్కరించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. మాచర్ల పట్టణ శివారులోని జమ్మలమడక వెళ్లే రహదారిలో రామప్ప దేవాలయం, చెన్నకేశవ స్వామి దేవాలయంలో నిత్య కల్యాణం, వీరభద్రస్వామి ఇష్టకామేశ్వరి దేవాలయం, పాత మాచర్లలోని గంగాపార్వతీ నగరేశ్వరస్వామి దేవాలయంలో ఆషాఢ ముగింపు, అమావాస్య ఆదివారం పూజలు ఘనంగా జరిపి అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆషాఢం ముగింపు సందర్భంగా పట్టణంలోని వివిధ దేవాలయాల్లో లలితాంబ, ఆదిలక్ష్మి పలు దేవాలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిపారు.

95 శాతం పింఛన్లు పంపిణీ

మాచర్ల: మాచర్ల నియోజకవర్గంలో సచివాలయాలలోని వివిధ విభాగాల ఉద్యోగుల ద్వారా 95 శాతం పింఛన్ పంపిణీని పూర్తి చేశారు. పట్టణంలో సుమారు ఐదు వేల మంది పింఛన్‌దారులకు సంబంధించి 4900 పైగా పింఛన్‌లు పంపిణీ చేశారు. + ఎండీఎం వాహనాల ద్వారా ఇంటింటికి రేషన్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వరకు 65 శాతం మాచర్ల పట్టణంలోని వివిధ రేషన్ డిపో వాహనాల ద్వారా పంపిణీ కార్యక్రమం పూర్తయ్యింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణబాబు సూచనలతో ఇంటింటికీ రేషన్ శరవేగంగా పూర్తి చేస్తున్నారు.

ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భరత్‌కుమార్



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా భరత్‌కుమారోను మూడవ సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్ మాట్లాడుతూ... ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరిస్తానని, అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, శ్రీను, మధు, వలి, చిందుకూరి నాగేంద్రరావు, సైదాచారి, ఆరిఫ్, రేవతి తదితరులు ఉన్నారు.

ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ



పిడుగురాళ్ల: పట్టణంలోని భవానీ నగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో దుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాలను సమర్పించారు. భక్తులకు ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



సత్తెనపల్లి: త్రుటిలో ప్రమాదం తప్పిన సంఘటన పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు నరసరావుపేట నుంచి ప్రయాణికులతో సత్తెనపల్లి వస్తోంది. ఈ సమయంలో పట్టణంలోని గాంధీ చౌక్ వైపు నుంచి కారు వస్తోంది. రెండూ గడియార స్తంభం సెంటర్‌లో ఢీకొన్నాయి. కారులో ఐదుగురు ప్రయాణికులు ఉన్నారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కారు ముందు డ్రైవర్ వైపు భాగం, ముందు అద్దం ధ్వసమైంది. ఆర్టీసీ బస్సు ఎడమ వైపు ముందు భాగం కొద్దిగా దెబ్బతింది.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

నరసరావుపేట: పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నెల్లూరి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో పట్టణంలోని సాంబశివపేట నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని పల్నాడు బాలోత్సవ్ కమిటీ కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు ప్రారంభించారు. వైద్య శిబిరంలో 170 మందికి పైగా రోగులకు డాక్టర్ నెల్లూరి రమేష్, బీపీ, షుగర్, జలుబు, దగ్గు, జ్వరం, నరాల వ్యాధులకు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మొక్కల పంపిణీని పల్నాడు విజ్ఞాన కేంద్రం భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ గద్దె చలమయ్య, డాక్టర్ నెల్లూరి రమేష్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కార్యదర్శి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి, సభ్యులు కామినేని రామారావు, బండారుపల్లి నాగేశ్వరావు, సిలార్ మసూద్, ఆంజనేయ నాయక్ పాల్గొన్నారు.

పాఠశాలలపై నిర్లక్ష్యపు నీడలు

- ప్రధానంగా వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- కొన్ని చోట్ల డిప్యుటేషన్‌పై చేయవలసిన దుస్థితి
- విద్యా సంవత్సరం ప్రారంభమైనా అందరికీ అందని స్టూడెంట్ కిట్లు
- మిగిలిన వాటితో సర్దుబాటు చేస్తున్న వైనం



అర్ధంతరంగా ఆగిపోయిన లెనిన్ నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్



గుండ్లపాడు పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థినులు



తరగతి గదుల్లో కింద కూర్చొని విద్యా బోధనలు వింటున్న విద్యార్థులు

కారెంపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత సమస్య నెలకొంది. ఈ కారణంగా విద్యార్థుల చదువులు సక్రమంగా సాగడం లేదు. వీటిలో కూడా ఎస్టీ బాలుర, బాలికల గురుకులాల్లో ఒకరు ఇద్దరు చొప్పున సబ్జెక్టు టీచర్ల కొరత ఉన్నట్లు తెలస్తోంది. ఇదిలా ఉంటే గత ఏడాదితో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య కూడా స్వల్పంగా తగ్గింది. గత ఏడాది ఇదే సమయానికి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య 5,155 ఉండగా ఈ ఏడాది 5,088 మంది మాత్రమే ఉన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థులు ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత, జెడ్పీ హైస్కూల్స్‌లో 3,638 మంది ఉన్నారు. గత ఏడాది కంటే విద్యార్థులు స్వల్పంగా తగ్గారని తెలుస్తోంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ప్రతి అధికారి మధ్యాహ్న భోజనం అమలుపై నిఘా పెట్టారు. విద్యార్థులందరికీ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కానుక కిట్లను హెచ్‌ఎంలు పంపిణీ చేశారు. లోటుపాట్లు ఉన్న చోట ఇటీవల జరిగిన హెచ్‌ఎంల సమావేశంలో ఎంఈవోలు ఆ మేరకు సర్దుబాటు చేశారు. మిగిలిన చోట ఉన్నవి తీసుకుని కొరత ఉన్న స్కూల్స్‌కు పంపి సర్దుబాటు చేస్తున్నారు. ప్రధానంగా ఉపాధ్యాయుల కొరత, స్వల్పంగా విద్యార్థుల చేరికల సంఖ్య తగ్గడం కన్పిస్తోంది.

గురజాల: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వహిస్తున్నారు. నాడు నేడు పనుల కింద 21 పాఠశాలల్లో రెండవ విడత పనులు గత ప్రభుత్వం ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఉపాధ్యాయుల కొరత ఉండటం వలన తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లోని ఉపాధ్యాయులు కొరత ఉన్న పాఠశాలలకు డిప్యుటేషన్‌పై వెళ్తున్నారు.

పిడుగురాళ్ల: ప్రభుత్వం మారింది అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అందుకు ఉదాహరణనే లెనిన్ నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లెనిన్ నగర్ ప్రాంతంలో హైస్కూల్ అవసరమని గుర్తించి తక్షణమే సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమి గుర్తించి లెనిన్ నగర్‌లో నాడు–నేడు ద్వారా నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహించారు. సుమారు 70 శాతం పనులు పూర్తయ్యాయి. సుమారు 30 శాతం పనులు మిగిలి ఉన్నాయి.

చాలీచాలని తరగతి గదుల్లో విద్య....

పట్టణంలోని లెనిన్ నగర్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఆరు గదుల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు సుమారు 346 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉన్న గదులు సరిపోక విద్యార్థులు వరండాలో కూర్చొని చదువుకుంటున్నారు. అంతేకాకుండా విద్యార్థులు కూర్చొనేందుకు కనీసం బెంచీలు కూడా లేకపోవటంతో కిందనే కూర్చుంటున్నారు. ఇరుకు తరగతి గదుల్లో సౌకర్యాలు లేకుండా ఈ ప్రాథమిక పాఠశాలలోనే ఉన్నత పాఠశాల నిర్వహణతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే లెనిన్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనం పూర్తయి ఉంటే విద్యార్థుల సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి లెనిన్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పూర్తి చేసి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని పట్టణ ప్రజలు, విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



నాడు నేడులో పూర్తయిన వెల్దుర్తిలోని కేజీబీవీ పాఠశాల

వెల్దుర్తి మండలంలో పాఠశాలల వివరాలు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు	6
ప్రాథమిక పాఠశాలలు	37
ప్రాథమికోన్నత పాఠశాలలు	6
గిరిజన ఆశ్రమ పాఠశాలలు	2
కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల	1
మండలంలో మొత్తం ఉండాల్సిన ఉపాధ్యాయులు	205
ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులు	118
మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు	**87**
ఏకోపాధ్యాయ పాఠశాలలు	18
ఉపాధ్యాయులు లేని పాఠశాలలు	6

ఈ పాఠశాలల్లో డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

నూతన పాఠశాల ప్రారంభమైతే బాగుంటుంది



లెనిన్ నగర్‌లో నూతనంగా నిర్మాణంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్ త్వరగా పూర్తి అయితే విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఇప్పుడు ఉన్న తరగతి గదులు సరిపోక అసౌకర్యంగా ఉంది. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా నూతన భవనం త్వరగా పూర్తయితే బాగుంటుందని కోరుకుంటున్నారు.

–ఎస్.నాగేశ్వరరావు, లెనిన్‌నగర్ పాఠశాల హెచ్‌ఎం

కారెంపూడి మండలంలో పాఠశాలల వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	27
యూపీ స్కూల్స్	06
జెడ్పీ హైస్కూల్స్	05
కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం	01
మోడల్ స్కూల్	01
ఎస్టీ బాలుర, బాలికల గురుకులాలు	02
ఏపీఎస్‌డబ్ల్యూఆర్	01
ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు	26

రెంటచింతల మండలంలోని పాఠశాలల వివరాలు

ప్రాథమిక పాఠశాలలు	22
ప్రాథమికోన్నత పాఠశాలలు	07
జెడ్పీ పాఠశాలలు	03
కేజీబీవీ, ఏపీ గురుకుల పాఠశాలలు	02
ఎయిడెడ్ పాఠశాలలు	03
విద్యార్థుల సంఖ్య	4,273
ఉపాధ్యాయులు సంఖ్య	2,714
ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య	**49**

గురజాల మండలంలోని పాఠశాలల వివరాలు

మండలంలోని ఉన్నత పాఠశాలలు	10
ప్రాథమిక పాఠశాలలు	27
ప్రాథమికోన్నత పాఠశాలలు	3

వాటిలో సుమారుగా 4,360 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి మాత జన్మదిన వేడుకలు

రెంటచింతల: స్థానిక బాలవికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సమీపంలో వేంచేసిన చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం వీర క్షత్రీయుల ఇలవేల్పు చౌడేశ్వరి దేవి అమ్మవారి జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవస్థానాల ప్రధాన అర్చకులు అనీల్ కుమార్ శర్మ నేతృత్వంలో వేకువజాము నుంచే అమ్మవారికి సుప్రభాత సేవ, వేద పారాయణం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచాంమృతాభిషేకాలు, నవగ్రహ మండపారాధన, సహస్ర కుంకుమార్చన, మంత్ర పుష్పం తదితరాలు జరిపించారు. అమ్మవారికి అలంకరించిన వెండి తొడుగు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకల్లో పాల్గొని బోనాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు దేవస్థానం వద్ద మహాన్నదానం చేశారు. దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ దీపాల తోరణాలతో ముస్తాబు చేశారు. దేవస్థానం పెద్దశెట్టి పల్లా వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. చల్లని తల్లి చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆశీస్సులతో పైరు పంటలు సమృద్ధిగా పండి గ్రామస్తులు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. కట్టమూరి నాగేశ్వరరావు, కట్టమూరి శ్రీనివాసరావు, దుగ్గిరాజు గోపాలకృష్ణమూర్తి చౌడేశ్వరి దేవికి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.



చౌడేశ్వరి అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు



జెట్టిపాలెంలో చౌడేశ్వరి అమ్మవారు

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకలు

జెట్టిపాలెం(రెంటచింతల): మండలంలోని జెట్టిపాలెం గ్రామంలో చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో వేంచేసిన తొగటి వీరక్షత్రీయుల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న చౌడేశ్వరి దేవి అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం కనుల పండువగా ఎంతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భవనగిరి ఆంజనేయ శర్మ నేతృత్వంలో ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి సుప్రభాత సేవ, వేద పారాయణం, గణపతి పూజ, అభిషేకాలు, నవగ్రహ మండపారాధన, సహస్ర కుంకుమార్చన జరిపించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు చౌడేశ్వరి అమ్మవారి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. సుమారు 200 మంది భక్తులు బోనాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు మహాన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన బండిపై అమ్మవారి ఉత్సవ విగ్రహంతో మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు

రెంటచింతల: మన చుట్టూ ఉన్న పరిసరాల పరిశుభ్రతతో పాటు పారిశుద్ధ్య పనులకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రమైన రెంటచింతలలోని వివిధ కాలనీలలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించి కార్మికులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో సైడు కాల్వలలోని పూడికలను తొలిగించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. సైడు కాల్వల్లోని మంచినీటి పైపు లైన్లను వెంటనే తొలిగించి కాల్వలకు పైభాగంలో ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరిసరాల పరిశుభ్రతతో మనం పలు రకాల వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. వర్షాకాలంలో విష జ్వరాలతో పాటు పలు రకాల అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. సైడు కాల్వల్లో పూడికలు తొలిగించాలని.. నివాస పరిసరాలలో మురుగు నీటి నిల్వలు ఉంటే దోమలు ఉధృతంగా పెరిగి గ్రామస్తులు విష జ్వరాల బారినపడే ప్రమాదం ఉందని సూచించారు. కార్యదర్శులు గ్రామాలలో ఇళ్ల మధ్య మురుగు నీరు లేకుండా చర్యలు చేపట్టి అంతర్గత రహదారులకు ఇరువైపుల నున్న సైడు కాల్వల్లో వారానికి ఒకసారి బ్లీచింగ్ చల్లించి ఫాగింగ్ చేపట్టాలన్నారు.



సైడు కాల్వల్లోని పూడికలను తొలగిస్తున్న పారుశుద్ధ్య కార్మికులు

ఏసు బోధనలు అనుసరించాలి

దాచేపల్లి : విశ్వాసంలో విశ్వాసులు మరింతగా బలపడాలని ఏఈఎల్‌సీ పశ్చిమ గుంటూరు సీనడ్ నాయకుడు గొట్టిముక్కల ఐజయ్య అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఆదివారం జరిగిన ప్రత్యేక ఆరాధనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐజయ్య మాట్లాడుతూ.. ప్రభువైన ఏసుక్రీస్తు చెప్పిన బోధనలు పాటించాలని, సాతాను పెట్టే ప్రలోభాలకు తలొగ్గకుండా క్రీస్తు రాకడ కోసం కనిపెట్టుకుని జీవించాలన్నారు. 185 సంవత్సరాల చరిత్ర కలిగిన ఏఈఎల్‌సీ ఎన్నో సంఘాలను స్థాపించిందని, క్రీస్తు రాకడ కోసం విశ్వాసులను సంఘాలు సిద్ధం చేస్తున్నాయని ఆయన తెలిపారు. అనంతరం ఐజయ్యను సంఘస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ జీఎస్ ప్రసన్నకుమార్, ఏఈఎల్‌సీ డెలిగేట్ వినుకొండ బాబు, చర్చి డెలిగేట్ శ్రీపతి కాశయ్య, సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు.



పశ్చిమ గుంటూరు సీనడ్ నేత ఐజయ్యని సన్మానిస్తున్న సంఘస్థులు

ట్రాఫిక్ నిబంధనలతోనే ప్రమాదాల నియంత్రణ

సత్తెనపల్లి: వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నియంత్రణ సాధ్యమవుతుందని సత్తెనపల్లి టౌన్ సీఐ పోలూరి శ్రీనివాసరావు అన్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద ఆదివారం వాహనదారులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కార్లు నడిపేవారు సీట్‌బెల్ట్ ధరించాలని ఆయన సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు. రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలు నడిపి ప్రమాదాలు చేయవద్దని, ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించి నడపాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో పట్టణ ఎస్ఐ ఎం.సంధ్యారాణి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్తెనపల్లి టౌన్ సీఐ శ్రీనివాసరావు

ఉపవాస ప్రత్యేక ప్రార్థనలు



ఉపవాస ప్రార్థనలు నిర్వహిస్తున్న వ్యవస్థాపకులు మోజెస్



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న మరనాత విశ్వాస సభ్యులు

మాచర్ల : ప్రతి ఒక్కరు కూడా యేసు బోధనలు అనుసరించి తోటి వారితో ప్రేమ, ఆప్యాయతలు కలిగి ఉండాలని ముఖ్య అతిథి, క్రైస్తవ సేవకులు ఆత్మీయ దైవజనులు గుళ్ళపల్లి మోజెస్ అన్నారు. మరనాత విశ్వాస సమాజం 25వ వార్డులో నిర్వహిస్తున్న 20వ వార్షికోత్సవంలో ఆయన ఉపవాస ప్రార్థనలు ప్రారంభించి మాట్లాడారు. చర్చి పాస్టర్ రెవరెండ్ వై.వెంకటేశ్వరరావు (ఎలిషా) ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేమ పూర్వక దైవ సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా మోజెస్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ 20 సంవత్సరాల క్రితం వెనుకబడిన ఈ ప్రాంతంలో యేసు ప్రభువు ఆశీస్సులతో నిర్వహించిన మరనాత విశ్వాస సమాజం ఈ రోజు వందలాది మంది క్రైస్తవుల ఆదరణ పొందడం ఎంతో సంతోషకరమన్నారు. 40 రోజుల పాటు నిర్వహించే ఉపవాస ప్రార్థనలు కఠినంగా అనుసరించి మరనాత ప్రభువు ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా శక్తివంతమైన దైవ సందేశాలు, ప్రత్యేక ప్రార్థన జరిపి అన్ని సంఘాల కాపరులను, పెద్దలను, విశ్వాసులను పిలిచి సందేశాలు అందించారు. సెప్టెంబర్ 11వ తేదీ వరకు జరిగే ఈ ప్రార్థనల్లో భక్తులు రెండు పూటల పాల్గొనాలని పాస్టర్ ఎలిషా కోరారు. ఈ సందర్భంగా సిరిగిరిపాడు గ్రామానికి చెందిన సురేష్, శిరీష దంపతులు, వృద్ధులు, అనాథ మహిళలు, వితంతువులకు నూతన వస్త్రాలను అందించి అన్నదాన కార్యక్రమం జరిపారు.

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

పెదకూరపాడు: స్థానికంగా నడుస్తున్న పేకాట స్థావరంపై పెదకూరపాడు ఎస్ఐ వెంకట్రావు ఆధ్వర్యంలో ఆదివారం సిబ్బంది దాడి చేశారు. తొమ్మిది మంది జూదరుల్ని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 31,830, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు



ముప్పాళ్ల: ఎన్నికల అనంతరం ప్రతి ఒక్కరూ వివాదాలను విడనాడి కలిసిమెలిసి ఉండాలని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు సూచించారు. మండల కేంద్రమైన ముప్పాళ్ల ముస్లిం కాలనీలో పల్లెనిద్రలో భాగంగా గ్రామస్తులకు శాంతిభద్రతలపై శనివారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివాదాలకు వెళ్లే ముందు కుటుంబసభ్యుల్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఏదైనా జరిగితే కుటుంబమంతా నష్టపోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ శాంతిభద్రతలకు సహకరించి గ్రామాభివృద్ధిపై దృష్టి పెట్టాలని చెప్పారు. వాహనదారులు మారిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, ద్విచక్రవాహనంపై ప్రయాణించేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.హజరతయ్య, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.